సాక్షి తిరుపతి

మంగళవారం, 30, ఏప్రిల్, 2024



పారదర్శక ఎన్నికలే లక్ష్యం

పారదర్శక ఎన్నికలే లక్ష్యమని, ఆ దిశగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. - 8లో



ఆర్థిక సాయం

అనారోగ్యంతో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆర్థిక సాయం అందించారు. - 8లో



సమరోత్సాహం

వైఎస్సార్‌సీపీ సమరోత్సాహంతో ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. పలువురు కూటమి నేతలు పార్టీలో చేరుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఆర్థిక అంశాలపై నిఘా



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం

తిరుపతి అర్బన్: పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై పటిష్ట నిఘా ఉంచాలని సాధారణ ఎన్నికల రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు ప్రదీప్‌కుమార్, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు వీజీ శేషాద్రి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు మీనుఓలా, తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు చిత్తూరు జిల్లా అబ్జర్వర్లు, రెండు జిల్లాల అసిస్టెంట్ వ్యయపరిశీలకులు, అకౌంటింగ్ టీమ్‌ల ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాల్సి ఉందన్నారు. ఆర్థిక లావాదేవీలు, నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువుల తరలింపు, మద్యం రవాణా తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ, నిఘా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో చేపట్టిన చర్యలు వివరించారు. సమావేశంలో జిల్లా వ్యయపరిశీలకుల నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు, ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి



పురుషోత్తంకు జ్ఞాపిక అందజేసి సత్కరిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: యువత సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని ఎస్వీ ప్రాచ్య కళాశాల అధ్యాపకులు డాక్టర్ కే.పురుషోత్తం సూచించారు. సోమవారం పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో తెలుగు సాహితీ సమితి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి కర్షక వాఙ్మయ కర్త దువ్వూరి రామిరెడ్డి అనే అంశంపై మాట్లాడారు. రైతులను సైనికులతో పోల్చిన కర్షక కవి దువ్వూరు రామిరెడ్డి అని కొనియాడారు. విద్యార్థులు తెలుగు భాష ఔనత్యాన్ని చాటి సాహిత్యాన్ని చదవాలని సూచించారు. అనంతరం ఆయనను వర్సిటీ తెలుగు విభాగం అధ్యాపకులు జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. తెలుగు శాఖాధ్యక్షులు వై.సుభాషిణి, డాక్టర్ యువశ్రీ, కే.తేజేశ్వరి, సుమాంజలి, గీతాంజలి, మధుయామిని, గౌరి పాల్గొన్నారు.

అనుమతులు పొందిన ప్రాంతంలోనే ప్రచారం

తిరుపతి అర్బన్: అనుమతులు పొందిన ప్రాంతంలోనే వివిధ రాజకీయ పార్టీల నేతలు సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రచారానికి సంబంధించి తిరుపతిలో ఏర్పడిన సంఘటనలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రధానంగా ప్రచారం కోసం అనుమతులు పొందిన పార్టీల అభ్యర్థులు వారు అనుమతులు పొందిన ప్రాంతంలోనే ప్రచారం చేయాలని, వారికి కేటాయించిన సమయంలోనే ప్రచారం చేయాలని స్పష్టం చేశారు. ఆమేరకు తిరుపతి ఆర్వో అదితిసింగ్‌కు స్పష్టమైన సూచనలు చేశామని చెప్పారు. అంతేకాకుండా ఒక పార్టీకి చెందిన అభ్యర్థి ప్రచారం చేస్తున్న ప్రాంతంలో మరో పార్టీకి చెందిన అభ్యర్థి ప్రచారం చేయడానికి అనుమతులు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పారు. కోడ్ ఉల్లంఘనలు లేకుండా ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రచారం సాగించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కోడ్ నిబంధనలు తప్పనిసరి

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు తప్పకుండా కోడ్ నిబంధనలు పాటించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా పోటీలోని పలువురు అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తిరుపతి పార్లమెంట్‌కు 23 మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 133 మంది బరిలో ఉన్నారని తెలిపారు. ఆ మేరకు పోటీలో ఉన్న అభ్యర్థులకు పార్టీ గుర్తులను తెలియజేశారు.

కాలు దువ్వి..కత్తి దూసి!

కపట కూటమి భారీ కుట్రకు తెరదీసింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో పక్క రాష్ట్రాల నుంచి రౌడీ మూకలను దించి అల్లర్లు సృష్టిస్తోంది. ఇది చాలదన్నట్టు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి సానుభూతి పొందాలని ఉవ్విళ్లూరుతోంది. అందులో భాగంగానే పథకం ప్రకారం దాడులకు తెగబడుతోంది. అడ్డూఅదుపూ లేకుండా రంకెలేస్తూ కాలుదువ్వి.. కార్యకర్తలపైకి కత్తి దూస్తోంది. స్థానికంగా తిష్ట వేసిన అల్లరిమూకలతో దాడులు చేయించి ఆపై తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కుయుక్తులు పన్నుతుండడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

- తిరుపతిలో రెచ్చిపోతున్న కూటమి అభ్యర్థి
- అధికార పార్టీ నేతలు, కార్యకర్తలను రెచ్చగొట్టడమే లక్ష్యం
- తద్వారా సానుభూతి పొందాలని ప్రణాళిక
- తమిళనాడు నుంచి రౌడీలను తెచ్చి ప్రత్యేక శిక్షణ
- మొన్న ఆర్డీఓ కార్యాలయం, నిన్న తిరుపతిలో ఘర్షణ వాతావరణం
- మండిపడుతున్న తిరుపతి వాసులు







వైఎస్సార్‌సీపీ నేత చరణ్ ఇంటి వద్ద రెచ్చగొడుతున్న జనసేన నేతలు,చిత్తూరు రౌడీ మూకలు చరణ్‌ను బయటకు రావాలంటూ.. చరణ్‌ను బాదుతూ..

ఇదిగో సాక్ష్యం

నగరంలోని నెహ్రూ నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు చరణ్ నివశిస్తున్నాడు. ఈ నెల 27న జనసేన కూటమికి చెందిన పార్థుతోపాటు 20 మందికి పైగా చరణ్ నివాసానికి వెళ్లి విధ్వంసం సృష్టించారు. ఇంటి ముందు ఉంచిన ద్విచక్ర వాహనాలను కింద పడేశారు. అంతేకాకుండా అరుపులు, కేకలు పెడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. చరణ్‌ను దుర్భాషలాడుతూ రెచ్చగొట్టే కార్యక్రమాలు చేపట్టారు. ఆపై ఇంట్లోకి చొరబడి చరణ్‌పై దాడికి తెగబడ్డారు. వీరిలో చిత్తూరు రౌడీ మూకలున్నట్టు స్థానికులు చెబుతున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తిరుపతిలో కూటమి అభ్యర్థి చేపడుతున్న ప్రచారానికి స్పందన లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి సానుభూతి పొందేందుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఇటీవల తిరుపతిలో వరుసగా చోటు చేసుకుంటున్న సంఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. నాలుగన్నరేళ్ల కాలంలో స్థానికులకు సేవ చేయకుండా.. స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుని చిత్తూరు జనం ఛీకొట్టారు. పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు ప్రజాసేవ చేయడంలో విఫలమైన ఆయనకు వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికల్లో టికెట్ నిరాకరించింది. ఆ తర్వాత ఆరణిని ప్యాకేజీ స్టార్‌కు ముడుపులు ఇచ్చి తిరుపతి కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయన అభ్యర్థిత్వాన్ని తిరుపతి నాయకులు, స్థానిక ఓటర్లు అంగీకరించకున్నా కూటమి అధినేతలు నేరుగా రంగంలోకి దిగి స్థానికులను బలవంతంగా ఒప్పించారు. దీనికితోడు కూటమిలో కీలకంగా ఉన్న నాయకులను స్థాయిని బట్టి ఆరణి శాంతి పూజలు చేశారనే ప్రచారం జరుగుతోంది. అంతా కలిసిపోయామంటూ చంకలు గుద్దుకుంటూ ప్రచారం ప్రారంభించారు. అయితే జనసేన అభ్యర్థి ఆరణి ప్రచారానికి స్పందన కరువైంది. అదే సందర్భంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి కూటమి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.



తిరుపతి నెహ్రూవీధిలోని చరణ్ ఇంటి వద్ద ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేస్తున్న జనసైనికులు

రంగంలోకి రౌడీ మూకలు

చిత్తూరుకి సరిహద్దులో తమిళనాడు ఉండడంతో ఆరణి శ్రీనివాసులుకి వారితో మంచి పరిచయాలు ఉన్నాయి. చిత్తూరులో ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు తమిళనాడుకు చెందిన రౌడీ మూకలతో అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలను బెదిరించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూ ఆక్రమణలను అడ్డుకోబోయిన స్థానికులపైనా తన రౌడీ మూకల చేత దాడులు చేయించారని బాధితులు వాపోతున్నారు. అదే తరహాలో ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో తన రౌడీ మూకలతో అల్లర్లు సృష్టించాలని నిర్ణయించారు. తమిళనాడు పరిధిలోని సుమారు 500 మంది రౌడీ మూకలను తిరుపతి నగరంలో 50 డివిజన్లలో దింపినట్లు విశ్వసనీయ సమాచారం. వీరికి అప్పగించిన డివిజన్లలో తిరగడం, కీలకంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణుల కదలికలను పసిగట్టే పనిలో నిమగ్నమైనట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ప్రచారంలో గొడవలు సృష్టించడం, ఆపై ఆ విషయాలను తన ఎల్లో మీడియా ద్వారా విషప్రచారం చేసేలా వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

టీడీపీ, జనసేన నేతల ఆందోళన

తిరుపతి, చంద్రగిరి పరిధిలో ఎప్పుడూ లేని విధంగా చిత్తూరు నుంచి వలస వచ్చిన కూటమి అభ్యర్థులు రౌడీలతో ప్రశాంతమైన నగరంలో అలజడులు సృష్టించడం మంచి పద్ధతి కాదని స్థానిక టీడీపీ, జనసేన నేతలు హెచ్చరిస్తున్నారు. అయితే వారి మాటలు పెడచెవిన పెట్టడంతో స్థానిక నాయకులు కూటమి అభ్యర్థులకు దూరంగా ఉంటే మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. కూటమి నేతలకు ఓటమి తప్పదని, ఆ తరువాత వారు చిత్తూరుకు వెళ్లిపోతారని చర్చించుకుంటున్నారు. ఎలా వచ్చారో అలా వెళ్లిపోతారని, ఆ తరువాత నష్టపోవాల్సింది మనమేనని తిరుపతి, చంద్రగిరికి చెందిన టీడీపీ, జనసేన నేతలు ఆందోళన చెందుతుండడం గమనార్హం.

పథకం ప్రకారమే దాడులు

తిరుపతిలో ఆరణి ప్రచారానికి పట్టుమని 25 మంది కూడా రాకపోవడంతో కూలీలను పిలిపించడం ప్రాంభించారు. ఆ కూలీలకు ఇచ్చే డబ్బుల్లో కక్కుర్తి పడుతుండడంతో వారు కూడా రావడం మానేశారు. ఒక్కొక్కరికీ రూ.500 ఇస్తామని బతిమలాడుతున్నా కూలీలు ససేమిర అంటున్నారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని ఆరణి వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి గొడవలకు కాలుదువ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగా ముందస్తుగా డివిజన్లలో దింపిన రౌడీ మూకలకు సమాచారం ఇచ్చారు. అందులో భాగంగానే తిరుపతి గిరిపురంలో వైఎస్సార్‌సీపీ ప్రచారం ఉందని తెలిసే ఆరణి శ్రీనివాసులు అదే ప్రాంతంలో తన ప్రచారాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు టీడీపీకి చెందిన ముఖ్యనేత ఒకరు 'సాక్షి'కి సమాచారం ఇచ్చారు. పథకం ప్రకారమే గిరిపురంలో కూటమి రౌడీలు వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి దాడులకు తెగబడ్డారు. ఇదే తరహాలో ఈనెల 25న ఆర్డీఓ కార్యాలయం వద్ద కూటమి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో తమిళనాడు రౌడీలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడ్డారు. కూటమి నేతలే దాడులకు తెగబడి వారే పోలీసులు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు ఇవ్వడాన్ని స్థానిక ఓటర్లు ఛీదరించుకుంటున్నారు. ఆర్డీఓ కార్యాలయం, గిరిపురం వద్ద జరిగిన గొడవలు కేవలం శాంపిల్ మాత్రమేనని కూటమిలోని ఓ ముఖ్య నాయకుడు తన అనుచరుల వద్ద నోరు జారారు. ఆ వెంటనే సర్దుకుని ఏమీ చెప్పనట్లు బిల్డప్పులు ఇచ్చి చిన్నగా జారుకున్నాడు. అతను నోరు జారినట్లు కూటమికి చెందిన రౌడీ మూకలు మరిన్ని దాడులకు పథకం వేసినట్లు స్పష్టమవుతోంది.



పుంగనూరులో తీవ్రంగా గాయపడ్డ పోలీస్ (ఫైల్)



పోలీస్ వాహనాన్ని ధ్వంసం చేస్తున్న పచ్చ గూండాలు(ఫైల్)

ఆ మారణ హోమం చల్లా వ్యూహం

- పుంగనూరును వల్లకాడు చేసేందుకు కుట్ర
- బాబు పర్యటనను అడ్డుపెట్టుకుని అల్లర్లకు యత్నం
- ప్రాణాలకు తెగించి.. రక్తం చిందించిన ఖాకీలు
- అప్పటి ఎస్పీ విచక్షణతో బెడిసికొట్టిన టీడీపీ నేతల పన్నాగం

పుంగనూరు : జిల్లాలోని పుంగనూరులో గత ఏడాది ఆగస్టు 4వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనలో మారణహోమం సృష్టించేందుకు ఆ పార్టీ నేతలు ప్రణాళికలు రూపొందించారు. కనీసం ఇద్దరు పోలీసులను చంపాలని దుర్మార్గపు ఆలోచనలు చేశారు. బాబు పర్యటనకు రెండు రోజుల ముందే ఈ ప్లాన్ మొత్తం రూపొందించారు. పోలీసులకు దాడులకు తెగబడి అల్లర్లు సృష్టించిన ఘటనలో అప్పటి టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబు అలియాస్ చల్లా రామచంద్రారెడ్డి గత ఏడాది ఆగస్టు 2వ తేదీన రొంపిచెర్లలో పార్టీ ప్రధాన వ్యక్తులతో రూపొందించిన పథకాన్ని ఆయన వ్యక్తిగత కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పూసగుచ్చినట్లు పోలీసులకు చెప్పాడు. ఇది విన్న పోలీసులు కేవలం ఉనికిని కాపాడుకునేందుకు ఇలాంటి క్షుద్ర రాజకీయాలకు పాల్పడతారా అని షాక్‌కు గురయ్యారు.

ప్లాన్– బీ..

ప్లాన్– ఏ అమలుకాని పక్షంలో ప్లాన్–బీకి సైతం పచ్చ పార్టీ నేతలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. పోలీసులు చనిపోకపోయినా, ఫైర్ ఓపెన్ చేయకపోయినా ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు మొత్తం ఒక్కసారిగా పుంగనూరు పట్టణంలోకి చొరబడాలి. ఎక్కడికక్కడ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫ్లెక్సీలు చింపడం, పెట్రోలు పోసి నిప్పంటించడం చేయాలి. దీనిపై వెంటనే వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రతిస్పందిస్తాయి. ఈ క్రమంలో చెలరేగే అల్లర్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఒకరిద్దరి మట్టుబెడితే.. వాళ్ల చేసే దాడుల్లో టీడీపీ కార్యకర్తలు సైతం చనిపోతారు. ఇది జరిగినా కూడా నెపం ప్రభుత్వంపై నెట్టేసి, శవ రాజకీయంతో సర్కారును పడగొట్టవచ్చని రెండో ప్లాన్‌ను సిద్ధం చేసుకున్నారు. రాష్ట్రం మొత్తం ఈ ఘటనలతో హోరెత్తిపోతుందని, అదే కారణంగా శాంతి భద్రతల వైఫల్యాన్ని ఎండగట్టాలని అనుకున్నారు. అయితే ఈ రెండు ప్లాన్ల గురించి టీడీపీలోని ప్రధాన వ్యక్తులకు తప్ప, పార్టీ కార్యకర్తల్లో ఒక్కరికి కూడా తెలియడానికి వీల్లేదని కట్టడి చేశారు. ఎక్కడా కూడా ఈ ప్లాన్ల గురించి ఎవరూ మాట్లాడకుండా అత్యంత గోప్యత పాటించారు. ఈ అల్లర్లకు పుంగనూరు నుంచి కాకుండా మదనపల్లె, ములకలచెరువు, సదుం, సోమల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలను రంగంలోకి దించాలని ఆదేశించారు.

ప్లాన్– ఏ..

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డికి జనాదరణ పెరిగిపోతుండడంతో చల్లా బాబు రగిలిపోయారు. ఇదే పుంగనూరులో పెద్దిరెడ్డిని జీరో చేయాలని, అదే సమయంలో రాష్ట్రం మొత్తం పుంగనూరు వైపు చూసేలా మారణహోమం సృష్టించాలని సంకల్పించుకున్నారు. చంద్రబాబు నాయుడు పర్యటన ర్యూట్ మ్యాప్‌లో పుంగనూరును చేర్చేందుకు పార్టీ శ్రేణులు పట్టుపట్టాలని నిర్ణయించారు. , పోలీసులు దీనికి కచ్చితంగా అంగీకరించరని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని నేతలు, కార్యకర్తలకు చల్లా బాబు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా అప్పటికే కృష్ణదేవరాయ కూడలి వద్ద సిద్ధం చేసుకున్న రాళ్లు, మద్యం బాటిళ్లు, బీరు సీసాలు, బాంబులను పోలీసులను లక్ష్యంగా చేసుకుని విసరాలి. మొత్తం 30 నిముషాల పాటు ఈ రాళ్ల దాడి చేయడానికి వస్తువులను ఉంచారు. తొలి మూడు నిమిషాల్లో చెప్పులు, వాటర్ బాటిళ్లు విసిరితే పోలీసులు తేలిగ్గా తీసుకుంటారు. అనంతరం పోలీసుల ఊహకు అందకుండా రాళ్లు, బాంబులు, మద్యం బాటిళ్లతో పది నిమిషాలు దాడులు చేయాలని, ఇందులో ఒకరిద్దరు పోలీసులు చనిపోయినా పర్లేదని ఆదేశించారు. ఇదే కనుక జరిగితే వెంటనే పోలీసులు కాల్పులు ఓపెన్ చేస్తారు. ఈ కాల్పుల్లో ఎటులేదన్నా 30 మంది వరకు టీడీపీ కార్యకర్తలు మరణిస్తారు. దీంతో దేశం మొత్తం పుంగనూరు వైపు చూస్తుందని, దీంతో ప్రభుత్వాన్ని కూల్చేసి, సానుభూతి పేరిట చంద్రబాబును సీఎం కుర్చీ ఎక్కించవచ్చనే భారీ పన్నాగం పన్నారు.

పోలీస్ ప్లాన్ ఇలా..

టీడీపీ నేతలు రూపొందించిన మారణహోమం ఉచ్చులో పోలీసులు చిక్కుకునే ఘటన దాదాపు అమలైపోతుందని ఆ పార్టీ నేతలు భావించారు. దీనికి తోడు అల్లర్ల సమయంలో అక్కడ బందోబస్తులో ఉన్న ఓ పోలీసు అధికారి వెంటనే అప్పటి ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ఫోన్ చేశారు. పోలీసులు రక్తమోడుతుండడం చూసిన ఆ అధికారి చలించిపోయి. గద్గద స్వరంలో ఎస్పీతో మాట్లాడుతూ.. 'సర్, పరిస్థితి చేయి దాటిపోతోంది. డీఎస్పీల తలలు పగిలిపోతున్నాయి. సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఇక్కడ ఆర్తనాదాలు చేస్తున్నారు. మనం ఫైర్ ఓపెన్ చేయాలి. వెంటనే మీరు కలెక్టర్‌తో మాట్లాడి ఫైరింగ్‌కు ఆర్డర్ ఇవ్వండి ప్లీజ్. లేకుంటే మన వాళ్లు చనిపోతారు..' అంటూ బతిమిలాడారు. అక్కడ ఏం జరుగుతోందని ఎస్పీ ఆరా తీశారు. సంయమనంతో ఆలోచించి పోలీసులు 300 మీటర్లు వెనక్కు వచ్చేయాలని ఆదేశించారు. దీంతో టీడీపీ శ్రేణులు రాళ్లు, మద్యం బాటిళ్లు నిల్వ ఉన్న ప్రాంతం నుంచి దూరమవుతారని చెప్పారు. ఇదే జరిగితే పోలీసులకు దగ్గరగా వచ్చిన టీడీపీ శ్రేణులను చెదరగొట్టడానికి స్వల్ప లాఠీచార్జ్, బాష్ప వాయు ప్రయోగించాలని సూచించారు. తాను కూడా వెంటనే పుంగనూరు వచ్చేస్తానని, అప్పటి వరకు ఒక్క బుల్లెట్ కూడా తుపాకీ నుంచి బయటకు రావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఎస్పీ ఆదేశాలను అమలు చేసిన పోలీసులు, అనుకున్నట్టుగానే రక్తం కారుతున్నా, అల్లరి మూకల్ని దగ్గరకు రప్పించి లాఠీలతో చెదరగొట్టారు. దీంతో టీడీపీ నేతల కుతంత్రాలు, కుట్రలు పటా పంచలైపోయాయి.

ఇలాంటి వ్యక్తికి టికెట్టా?

స్వార్థ రాజకీయాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాటే చల్లా రామచంద్రారెడ్డికి టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంపై పుంగనూరు వాసులు మండిపడుతున్నారు. ఇలాంటి ఆలోచనా విధానమున్న వ్యక్తిని రాజకీయాల్లో ప్రోత్సహించడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పుంగనూరులో చల్లా గ్యాంగ్ చేతిలో దగ్ధమవుతున్న పోలీస్ వాహనాలు(ఫైల్)

బ్యాంక్ ఖాతాల్లోకి పింఛన్ నగదు

- బ్యాంక్ ఖాతా లేకుంటే ఇంటికే..

తిరుపతి అర్బన్: సామాజిక పింఛన్ లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయనున్నట్టు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బ్యాంక్ ఖాతాలు లేనివారికి నేరుగా సిబ్బంది ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తారని చెప్పారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడారు. బ్యాంక్ ఖాతాలు ఉన్నవారికి బ్యాంక్‌లో ఫించన్ నగదు జమ చేస్తారని, లేని వారికి ఇంటి వద్దకే వచ్చి ఫించన్ అందిస్తారని చెప్పారు. ఆ మేరకు బ్యాంక్ అధికారులు సంబంధిత బ్యాంక్‌ల వద్ద లబ్ధిదారులకు అవసరమైన తాగునీరు, నీడ కోసం షామియాన తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

సమన్వయంతోనే అక్రమాలకు చెక్



సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

తిరుపతి క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమాలకు చెక్‌పెట్టడానికి ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సూచించారు. తిరుపతిలోని పోలీస్ అతిథిగృహంలో ఆయన ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ పొందిన మద్యం విక్రయదారులను తరచుగా తనిఖీలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనధికార వ్యక్తులకు మద్యం విక్రయించకుండా నిరోధించాలని చెప్పారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో బార్ అండ్ రెస్టారెంట్‌లలో జరిగే రోజువారీ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ సీఐల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. మద్యం దుకాణాలు, బార్లు నిర్దేశిత సమయాలలోనే అమ్మకాలు జరిపేలాగా ఎక్సైజ్ సీఐలు ఆకస్మికంగా దాడులు నిర్వహించాలన్నారు. పెద్ద మొత్తంలో మద్యం అమ్మకాలు జరగకుండా తరచుగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో అక్రమాలకు పాల్పడిన 17 మంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్లను విధుల నుంచి తొలగించినట్టు వెల్లడించారు. ఇంకా ఎవరైనా అవకతవకలకు పాల్పడితే వారిపైనా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్రతోపాటు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జానకిరామ్, ఓజిలి డిపో మేనేజర్ సత్యనారాయణ బాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, జిల్లాలోని సెబ్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం


సీజ్ చేసిన తమిళనాడు రేషన్ బియ్యం

దొరవారిసత్రం: అక్రమంగా తరలిపోయేందుకు సిద్ధంగా ఉన్న తమిళనాడు రేషన్ బియ్యాన్ని సోమవారం సివిల్‌సప్లై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీఎస్ డీటీ ఓబయ్య కథనం.. చెన్నై నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకుని పోలిరెడ్డిపాళెం గ్రామ సమీపంలోని ఓ గోదాములో నిల్వచేశారు. సమాచారం అందుకున్న సివిల్‌సప్లై, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 14,400 కేజీల తమిళనాడు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ సుమారు రూ.4.32 లక్షలు ఉంటుందని అంచనా.

అడవిలో కంటైనర్

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలం, నిడిగల్లు గ్రామ సమీపం వద్ద బోయినగుంట అడవుల్లో ఓ గుర్తు తెలియని కంటైనర్ మూడు రోజుల నుంచి అనుమానాస్పదంగా ఉంది. తహసీల్దార్ పుల్లారావు, ఎస్‌ఐ మహబూబ్ సాహేబ్ ఘటనా స్థలానికి చేరుకుని కంటైనర్‌కు వేసిన తాళం పగులగొట్టి పరిశీలించగా ఖాళీగా ఉంది. ఈ మేరకు వాహనాన్ని బాలాయపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య


మౌనిష

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన మౌనిష (31) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం.. గ్రామానికి చెందిన పెంచలయ్య కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 25న ఇంటి ముందు మురుగు నీటి కాలువ విషయమై పెంచలయ్యకు పక్కనే నివాసం ఉంటున్న చిరంజీవి, వీరాఘవులు, సుధీర్, సుజాత, చంద్రయ్య, రమేష్‌కు గొడవ జరిగింది. ఈ గొడవలో పెంచలయ్యతోపాటు భార్య మౌనిషపై వారు దాడి చేశారు. దీన్ని అవమానంగా భావించిన మౌనిష గురువారం పురుగు మందు తాగింది. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది.

వైఎస్సార్‌సీపీలో సమరోత్సాహం


వెంకటగిరి : వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


చంద్రగిరి : వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న తుడా చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- కొనసాగుతున్న వలసలు
- క్యూకడుతున్న కూటమి నేతలు

చంద్రగిరి: జిల్లాలో వైఎస్సార్‌సీపీ సమరోత్సాహంతో ముందుకు దూసుకుపోతోంది. తమకు మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా చూడాలని పలువురు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి మండలంలోని అగరాల పంచాయతీకి చెందిన 20 కుటుంబాలు సర్పంచ్ భాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తుడా చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేశారు. వీరందరికీ మోహిత్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అగరాల మాజీ సర్పంచ్ నాగరాజ సతీమణి చెంచులక్ష్మి, సినియర్ టీడీపీ నాయకులు అన్నూరు లక్ష్మాచారి, నాయకులు మస్తాన్, సానియా, మహేశ్వర్‌రెడ్డి(సమర), కాలేష, మిర్చి, బండకాడపల్లి రహీం(లాలు), ఎర్రయ్య, రాయనూతల వెంకటరమణ, నాగురు మల్లిక, మునికృష్ణయ్య, సాధిక తదితర 20 కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో చిరంజీవి, బషీర్, మున్న, నాగేశ్వరరావు రెడ్డి, చాను, వెంకటేష్, అశ్రత్, రహీం, మునిరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 20 టీడీపీ కుటుంబాలు

వెంకటగిరి రూరల్: బాలాయపల్లి మండలం, వెంగమాంబపురం గ్రామ పంచాయతీకి చెందిన సుమారు 20 బీజేపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే మైనారిటీల అభ్యున్నతి

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ముస్లిం, మైనారిటీల అభ్యున్నతికి కృషి చేశారని పలువురు సంతోషాన్ని వ్యక్తం చేశారు. తిరుపతి 13వ డివిజన్‌లో డెప్యూటీ మేయర్, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు ఆధ్వర్యంలో ఆ వార్డు జెండామాను వీధికి చెందిన 30 కుటుంబాలు అభినయ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి అభినయ్ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే.బాబు, పార్టీ నాయకులు రాపూరిప్రసాద్, కోటూరు శశి పాల్గొన్నారు.


తిరుపతి : వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లింలతో భూమన అభినయ్‌రెడ్డి


రేణిగుంట: కరకంబాడి బీసీ కాలనీలో పార్టీలో చేరిన వారితో బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

వైఎస్సార్ సీపీలో వంద మంది చేరిక

రేణిగుంట: మండలంలోని కరకంబాడి బీసీ కాలనీలో 100మంది టీడీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలన, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరినట్లు వివరించారు. రేణిగుంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సీ.తిరుమలరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్, నెమళ్ల పార్థసారథిరెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, ప్రకాష్, యోగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో ఐదు కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,241 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,730 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.65 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

3 నుంచి భాష్యకారుల ఉత్సవం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మే 3 నుంచి 21వ తేదీ వరకు భాష్యకార్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం సందర్భంగా 19 రోజులపాటు ఉభయం సమర్పణ జరుగనుంది. శ్రీరామానుజు లవారు జన్మించిన వైశాఖ మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మే 12వ తేదీన భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఈసందర్భంగా సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీశ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారిని ఒక తిరుచ్చిపై, శ్రీభాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. ఆ తరువాత ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు భాష్యకార్లవారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో స్నపనం చేపడతారు. జీయంగార్లు, ఏకాంగులు తదితరులు పాల్గొంటారు.

పారదర్శక ఎన్నికలే లక్ష్యం

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుక సర్వశక్తులూ ఒడ్డుతున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. మే 13 పోలింగ్ డే సమర్థవంతంగా చేపట్టడానికి జోరుగా ఏర్పాట్లు పూర్తవుతున్నట్టు వెల్లడించారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 200 నామినేషన్లు వచ్చాయని, అందులో 47 నామినేషన్లు తిరస్కరించగా.. 20 నామినేషన్లు ఉపసంహరించుకున్నారని వివరించారు. ఈ క్రమంలో 133 మంది బరిలో ఉన్నారని పేర్కొన్నారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీకి 46 మంది పోటీలో ఉన్నట్టు వెల్లడించారు.

తిరుపతి ప్రచారంపై ప్రత్యేక ఫోకస్

తిరుపతిలో ప్రచారం సందర్భంగా ఏర్పడుతున్న వివాదాల నేపథ్యంలో ప్రత్యేక ఫోకస్ పెట్టినట్టు కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, కూటమి వారు ప్రచారానికి అనుమతులు ఒకే సమయంలో ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పారు. ఒకే సమయంలో ప్రచారం చేయడంతోనే వివాదాలు వస్తున్నాయని వెల్లడించారు. అందుకు కారకులపై కేసులు నమోదు చేశామన్నారు.

పటిష్టమైన భద్రత

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. జిల్లాకు రెండు మూడు రోజుల్లో అదనపు బలగాలు వస్తాయని వెల్లడించారు. వివాదాలు సృష్టిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు రూ.19 కోట్ల విలువ వస్తువులు, నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై మరింత దృష్టి పెట్టామని, ఆయా ప్రాంతాల్లో పోలీసులు పల్లె నిద్రలో భాగంగా ఉంటున్నారని వివరించారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుపతి క్రైమ్: అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ షేక్ ఇలియాస్ కుటుంబం సభ్యులకు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ రూ.1.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. అదేవిధంగా జిల్లాలో పనిచేస్తున్న నలుగురు హోంగార్డ్లకు వైద్య ఖర్చుల కోసం పదివేల చొప్పున అందజేశారు. ఈ చెక్కులను సోమవారం ఎస్పీ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు అందజేశారు.

జగన్‌మోహన్‌రెడ్డితోనే బ్రాహ్మణ సంక్షేమం

- బ్రాహ్మణులను వంచించిన చరిత్ర చంద్రబాబుది
- దేవదాయ శాఖ సలహాదారుడు శ్రీకాంత్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

తిరుపతి కల్చరల్: అణచివేతకు గురవుతున్న బ్రాహ్మణ సమాజాన్ని గుర్తించి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని దేవదాయ శాఖ సలహాదారుడు జ్వోలాపురం శ్రీకాంత్ స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బ్రాహ్మణ సమాజం నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ 40 ఏళ్లగా బ్రాహ్మణులను ఉక్కుపాదంతో అణచివేతకు గురి చేసి దగా చేసిందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కరణం వ్యవస్థను తీసివేశారని, వంశ పరంపరపర్య అర్చక, పురోహితుల హక్కులను తొలగించగడంతో పాటు బ్రాహ్మణ ఉద్యోగుల వయోపరిమితిని తగ్గించి, ధార్మిక పరిషత్ రద్దు, ఆలయాల కూల్చివేత, సదావర్తు భూముల దోపిడీకి పాల్పడి బ్రాహ్మణుల జీవితాలను చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బ్రాహ్మణుల సంక్షేమాన్ని గుర్తించి, వారి అభ్యున్నతికి బాటలు వేశారని తెలిపారు. ఆయన బాటలో తనయుడు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణులకు అనేక పదవులు కల్పించి, రాజకీయ ఎదుగుదలకు, అభ్యున్నతికి తోడ్పాటు అందించారని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో దోపిడీ, జగనన్న పాలనలో సంక్షేమాన్ని వివరించేందుకు ఈనెల 26న అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు యాత్ర ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యానికి సముచిత స్థానం కల్పిస్తూ వాటిని ప్రజలకు చేరువ చేసిన జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు అండ్‌కో అవాస్తవాలతో ప్రజలను తప్పుదారిపట్టిస్తోందని పేర్కొన్నారు. బ్రాహ్మణ సమాజాన్ని వంచించిన చంద్రబాబుకు గుణపాఠం చెప్పక పోతే భవిష్యత్ అంధకారం కాక తప్పదన్నారు. అలాగే నిరంతరం బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేయడమేకాక బ్రాహ్మణ వర్గ ప్రముఖుల విగ్రహాలను తిరుపతిలో ఏర్పాటు చేయడంతో పాటు వారి పేర్లతో రోడ్లు ఏర్పాటు చేస్తున్న చరిత్ర ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయన తనయుడు అభినయరెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని పిలుపు నిచ్చారు. సంఘం నేతలు సీఆర్‌కే శేషగిరిరావు, సి.రాజ్యలక్ష్మి, భాగవతుల విజయలక్ష్మి, అంజిబాబు, పెరుమాళ్, భాస్కర్, మురళి, సుబ్బయ్య పాల్గొన్నారు.

వేధింపులు భరించలేక రాజీనామా


రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

గూడూరు రూరల్: కూటమి నేతల వేధింపులు భరించలేక తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్టు వలంటీర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం గూడూరు మున్సిపాల్టీ పరిధిలోని సచివాలయాలో పనిచేసే 20 మంది వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు అండగా నిలుస్తున్నామని వారు పేర్కొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి


చెంచయ్య (ఫైల్)

గూడూరురూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని గొల్లపల్లి గిరిజన కాలనీకి చెందిన ఓ గిరిజనుడు సోమవారం వడ దెబ్బకు గురై మృతి చెందాడు. స్థానికుల వివరాలు.. గిరిజన కాలనీకి చెందిన పెనిమిటి చెంచయ్య(43) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన ఆదివారం ఎండలో పనికి వెళ్లి వడదెబ్బకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆపై ఆదివారం వేకువజామున అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందినట్టు పేర్కొన్నారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తిరుపతి క్రైం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఈ ఏడాదిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ట్రాఫిక్ పోలీసులను ఆయన అభినందించారు. ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ నేతృత్వంలో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 380 కేసులు నమోదు చేయడంతోపాటు ఆ వ్యక్తుల నుంచి రూ.19,36,000 జరిమానా విధించినట్టు వెల్లడించారు. అంతేకాకుండా ఐదుగురికి రెండు రోజుల పాటు జైలుశిక్ష వేశారన్నారు. రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారిపై 398 కేసులు నమోదు చేసి, వారి నుంచి రూ.79,600 జరిమానా విధించినట్టు పేర్కొన్నారు. ఒకే మోటార్ సైకిల్ పై ముగ్గురు వ్యక్తులు(త్రిబుల్ రైడింగ్), మైనర్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, శబ్ద కాలుష్యం వెలువడు వాహనాలపై 8,478 కేసులు నమోదు చేసి రూ. 95,85,119 అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు.

నూతన కోర్సులు.. సిలబస్ మార్పులపై ఆమోదం


వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ : ఎస్వీయూ సెనేట్ హాల్లో సోమవారం వీసీ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన అకడమిక్ సెనేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యాపరమైన పలు నిర్ణయాలకు సెనేట్ ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో ప్రధానంగా 2022-23 వర్సిటీ నివేదికకు సెనేట్ ఆమోదం తెలుపగా, 2024-25కు సంబంధించి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై, నూతన విద్యావిధానంలో భాగంగా వర్సిటీలో ప్రవేశపెట్టనున్న నూతన కోర్సులకు, పీజీ కోర్సుల్లో సిలబస్ మార్పుపై ఏకగ్రీవంగా సెనేట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు ఆచార్య సుగుణ, డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ సుమకిరణ్, ప్రొఫెసర్ పద్మనాభం, నారాయణబాబు, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, ఎంఎం నాయుడు, సెనేట్ మెంబర్లు, డీన్లు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

1 నుంచి స్కేటింగ్ ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బాలాజీకాలనీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మే 1వ తేదీ నుంచి వేసవి సెలవుల సందర్భంగా స్పీడ్ స్కేటింగ్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చిన్నారి భరోసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రేమ్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచితంగా శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. వీరు ఆయా పాఠశాలల స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించాలని సూచించారు. ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 5నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 77300 44191, 90004 13207 నంబర్లను సంప్రదించవచ్చని ఆయన కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం.. పట్టణంలోని తుమ్మూరు బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన మేకల పోలయ్య(45) ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు విక్రయించి జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి చలివెంద్రం గ్రామం వద్ద రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.